# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 119 వ భాగం

## పురంజనోపాఖ్యానం 12

క్రితం వ్యాసంలో చూసినట్టూ ప్రాచీనబర్హి పుత్రులకి రుద్రుడు కనబడి దీక్ష ఇవ్వడానికి పూనుకోవడం, దానిలో భాగంగా ఏమైంది అనేది. ప్రచేతసులు రుద్రుడికి పాదనమస్కారం చేసి సిద్ధం అయ్యాక ఆయన చెప్తున్నాడు భగవంతుణ్ణి ఎలా ప్రార్ధించాలో. కొన్ని పద్యాలలో దాదాపు అన్ని పదాలు సంస్కృతంలో ఉండేటట్టూ పోతన ఎలా అమర్చాడో గమనించండి. ఇటువంటి పద్యాలు చాలా ఉన్నాయి భాగవతంలో.

క. వనజాసనుఁ డాత్మజు లగు
సనకాదులఁ జూచి పలికె సమ్మతితోడన్
వినుఁడు కుమారకులారా!
వనజోదరు మంగళస్తవం బెఱిఁగింతున్. [4-700]

వ. అని హరి నుద్దేశించి వారలు విన నిట్లనియె "నో! యీశా! యాత్మవేదు లైన వారలకు భవదీయోత్కర్షంబు స్వానందలాభకరంబు గావున నట్టి స్వానందలాభంబు మాకుం గలుగ వలయు; నీవు పరిపూర్ణానంద స్వరూపుండవు; ఇట్టి సర్వాత్మకుండవైన నీకు నమస్కరింతు" నని వెండియు నిట్లనియె. [4-701]

శ్రీహరిని ఇలా ప్రార్ధించాలి అని వాళ్లతో ఎలాగో చెప్తున్నాడు. ఆత్మజ్ఞానులకి భగవంతుణ్ణి స్తుతించడం వల్ల (భవదీయ – నీ, ఉత్కర్షంబు – స్తుతించడం), ఆనందం కలుగుతోంది (స్వానందము – మంచి ఆనందం). అటువంటి ఆనందం మాకు కూడా కలుగుగాక. సర్వాత్ముడవైన నీకు నమస్కారం. ఇప్పుడు స్తోత్రం గమనించండి.

సీ. పంకజనాభాయ సంకర్షణాయ శాం
తాయ విశ్వప్రబోధాయ భూత
సూక్ష్మేంద్రియాత్మనే సూక్ష్మాయ వాసుదే
వాయ పూర్ణాయ పుణ్యాయ నిర్వి
కారాయ కర్మవిస్తారకాయక్షేత్ర-
పాలాయ త్రైలోక్యపాలకాయ
సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వ
యం జ్యోతిషే దురన్తాయ కర్మ [4-702]

తే. సాధనాయ పురాపురుషాయ యజ్ఞ
రేతసే జీవతృప్తాయ పృథ్వీరూప
కాయ లోకాయ నభసే న్తకాయ విశ్వ
యోనయే విష్ణవే జిష్ణవే నమోస్తు. [4-702.1]

ఇప్పుడు చెప్పండి, ఈ సీసం, ఎత్తుగీతి తెలుగా, సంస్కృతమా? ఇందులో కొన్ని పదాలని చూద్దాం. పంకజనాభాయ – పద్మం నాభిలో ఉన్నవాడు. సంకర్షణాయ – అహంకారానికి అధినేత, విశ్వప్రబోధాయ – విశ్వానికి చైతన్యం కలిగించేవాడు, నిర్వికారాయ – ఎటువంటి వికారాలు లేనివాడు, సోమరూపాయ – సో; ఉమ రూపాయ – శివుడు; శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే అని కదా? స్వయంజ్యోతిషే – స్వయం ప్రకాశం కలవాడు. దురన్తాయ – దురితములని (పాపము) అంతము చేయువాడు, నభసే – ఆకాశమే తాను అయినవాడు; అంతకాయ – విలయానికి కారకుడు, జిష్ణవే – జయించుచాడు; ఇటువంటి విష్ణువుకి నమస్కారం. మరో సీసం చూద్దాం.

సీ. స్వర్గాపవర్గ సుద్వారాయ సర్వ ర
సాత్మనే పరమహంసాయ ధర్మ
పాలాయ సద్ధిత ఫలరూపకాయ కృ
ష్ణాయ ధర్మాత్మనే సర్వశక్తి
యుక్తాయ ఘన సాంఖ్య యోగీశ్వరాయ హి

రణ్య వీర్యాయ రుద్రాయ శిష్ట
నాథాయ దుష్ట వినాశాయ శూన్య ప్ర
వృత్తాయ కర్మణే మృత్యవే వి [4-703]

తే. రాట్ఛరీరాయ నిఖిల ధర్మాయ వాగ్వి
భూతయే నివృత్తాయ సత్పుణ్య భూరి
వర్చ సేఖిల ధర్మదేహాయ చాత్మ
నే నిరుద్ధాయ నిభృతాత్మనే నమోస్తు. [4-703.1]

మొదటి పదం గమనించారా? స్వర్గాపవర్గ సుద్వారాయ – స్వర్గానికి అపవర్గం అంటే స్వర్గం కన్నా పైనది – మోక్షం. ఆ మోక్షానికి ద్వారం తెరుచుకునేది ఈయన వలనే. సద్ధిత ఫలరూపకాయ – మంచివారి ఫలమే భగవంతుడు. ఘనసాంఖ్యయోగీశ్వరాయ – అనేకమంది గొప్ప యోగులందరికీ ఈశ్వరుడు, శూన్య ప్రవృత్తాయ – ప్రవృత్తులు ఏమీ లేనివాడు, అకర్మణే – తనకేమీ అంటుకోవు ఏ పని చేసినా అందువల్ల కర్మ చేసినా చేసినట్టు కాదు; మృత్యవే – పుట్టించేవాడు ఈయనే అయితే మృత్యువు కూడా ఆయనే. విరాట్ఛరీరాయ – విరాట్పురుషుడు. ప్రపంచం అంతా ఆయనలోనే ఉన్నవాడు. నిఖిలధర్మాయ – అన్ని ధర్మములు తానైనవాడు, వాగ్విభూతయే – వాక్కు అనే వైభవము తానే అయిన వాడు, సత్పుణ్యభూరివర్చసే = మంచి పుణ్యాత్ముల వలె ఎక్కువగా ప్రకాశముగలవాడు, అఖిలధర్మదేహాయ – అన్ని ధర్మముల స్వరూపమైనవాడు, అనిరుద్దాయ – అనిరుద్ధుడు – అడ్డుకొనరానివాడు, నిభృతాత్మనే – వృద్ధి; క్షయములులేని స్థిరమైన ఆత్మస్వరూపుడు.

తే. సర్వ సత్త్వాయ దేవాయ సన్నియామ
కాయ బహిరన్తరాత్మనే కారణాత్మ
నే సమస్తార్థ లిఙ్గాయ నిర్గుణాయ
వేధసే జితాత్మక సాధవే నమోస్తు. [4-704]

సర్వ సత్వాయ – అన్ని రకాల సామర్ధ్యములు ఉన్నవాడు, సన్నియామకాయ – సత్యమైన నియామకుడు, ఎవర్ని ఏ పదవిలో కూర్చోబెట్టాలో తెల్సినవాడు, సమస్తార్ధ లింగాయ – సమస్త ప్రయోజనాలకీ చిహ్నం వంటివాడు, నిర్గుణాయ

– త్రిగుణాలకి అతీతుడు, వేధసే – బ్రహ్మస్వరూపుడు, జితాత్మక సాధవే – చిత్తము/మనస్సుని జయించిన, సాధుస్వరూపుడు. అటువంటి భగవంతుడికి నమస్కారం.

వ. వెండియు, శంఖ చక్ర గదా పద్మ కలితాయత బాహు చతుష్టయంబును, వైజయంతీ వనమాలికా కౌస్తుభమణి శ్రీవిరాజితంబును, నిత్యానపాయిని యయిన యిందిరాసుందరీరత్న పరిస్పందంబునం దనరి తిరస్కృత నికషోపలం బైన వక్షస్థలంబును, యుచ్ఛ్వాస నిశ్వాసంబులం జంచలంబులైన వళిత్రయ రుచిర ప్రకాశమాన దళోదరంబును, పూర్వ వినిర్గత నిఖిల విశ్వంబునుం బ్రవిష్టంబుఁజేయురీతి నొందు సలిలావర్త సన్నిభ గంభీర నాభివివరంబును, పంకజ కింజల్క విభాసిత దుకూలనిబద్ధ కనక మేఖలా కలాప శోభితశ్యామ పృథు నితంబ బింబంబును, నీలకదళీస్తంభరుచి రోరు యుగళంబును, సమచారు జంఘంబును, నిమ్నజాను యుగళంబును, బద్మపత్ర భాసుర పాదద్వయంబును, మదీయాంతరంగ తమోనివారక నిర్మల చంద్రశకల సన్నిభనఖంబును, గిరీట కుండల గ్రైవేయహార కేయూర వలయ ముద్రికా మణినూపురాది వివిధ భూషణ భూషితంబును, నిరస్త సమస్త నతజన సాధ్వసంబును, భక్తజన మనోహరంబును, సర్వ మంగళాకరంబును నైన భగవద్దివ్య రూపంబుఁ దామస జన సన్మార్గ ప్రదర్శకుండవైన నీవు మాకుం జూపి మమ్ముఁ గృతార్థులం జేయు" మని వెండియు నిట్లనియె. [4-711]

ఇప్పటివరకూ భగవంతుడి గుణాల గురించి చెప్పాడు. అలా గుణాలు చూసి అసలు రూపు ఊహించుకోవడం అందరికీ కష్టం కనక భగవంతుడి రూపం ఎలా ఉంటుందో అనేది కూడా చెప్తున్నాడిప్పుడు. శంఖ, చక్ర, గదా పద్మాలు కల నాలుగు చేతులవాడు, వైజయంతీ, వనమాలికా, కౌస్తుభమణి అనేవి కలిగినవాడు. మకరకుండల కిరీట కేయూర హార కంకణ మణి మేఖలాంబరాలతో పాటు అనేక భూషణాలు కలిగినవాడు, అజ్ఞానులకి సన్మార్గం చూపించేవాడు కనక ఆ రూపు మాకు చూపించి మమ్మల్ని ధన్యులని చేయవల్సిందిగా వేడుకుంటున్నాం. ఇటువంటి వివరణే మనం భగవత్ రామానుజులు రచించిన వెంకటేశ్వర గద్యంలో (... సువికస్వర దళభాస్వర కమలోదర గతమేదుర..... పదపద్మరేణు సంచిత వక్షస్థల పటవాసః శ్రీశ్రీనివాసః సుప్రసన్నో విజయతాం..) కూడా చూడవచ్చు. ఈ వెంకటేశ్వర గద్యంలో ఇక్కడ చదువుకోవచ్చు [https://stotranidhi.com/srinivasa-gadyam-in-telugu/ నుంచి]

సీ. ఆత్మకుఁ బరిశుద్ధి నర్థించు వారికి–
ధ్యేయ వస్తువు భవద్దివ్యమూర్తి;
యంచిత స్వర్గరాజ్యాభిషిక్తున కైన–
సమధిక స్పృహణీయతముఁడ వీవు;

సద్భక్తియుత భక్త జన సులభుండవు–
దుష్టాత్ములకుఁ గడు దుర్లభుండ;
వాత్మదర్శనులకు నరయ గమ్యుండవు–
నై యర్థి విలసిల్లు దనఘచరిత! [4–712]

తే. యిట్టి నిఖిల దురారాధ్యు నీశు నిన్ను
నెఱయ సుజనుల కైన వర్ణింపరాదు;
వఱల నెవ్వఁడు పూజించు వాఁడు విడువఁ
జాలునే? పద్మదళనేత్ర! సచ్చరిత్ర! [4–712.1]

ఇంత చెప్పాడు కనక అసలెందుకు భగవంతుణ్ణి సేవించడం అనేది ఇప్పుడు చెప్తున్నాడు – మనసు పరిశుద్ధం చేసుకుని ఆత్మని దర్శించడానికి పూనుకునేవారికి ధ్యేయం భగవంతుడి దివ్యమైన రూపం. ఆత్మదర్శనం అయ్యాక తెలిసేది తానూ ఆత్మా ఒకటే, వేరు వేరు కాదు అనేది (నారాయణ పరోధ్యాతా ధ్యానం నారాయణః పరః – ధ్యాతా, ధ్యానం రెండూ నారాయణుడే). స్వర్గాధిపతియైన ఇంద్రుడు వంటి వారికైనా కనబడకపోవచ్చు కానీ మంచి భక్తులకి సులభంగా కనిపించేవాడివి. దుష్టులకి మాత్రం అత్యంత దుర్లభుడవి. ఇటువంటివాడివి కనక నిన్ను ఎంతని అయినా వర్ణించడం కష్టం. అటువంటి సచ్చరిత్రుడివైన నిన్ను విడవడం కుదరదు కదా?

చ. ఎనసిన భక్తియోగమున నే భవదీయపదాబ్జ మొందఁగా
ననయముఁ గోరువాఁడు చటులాగ్రహ భీషణ వీర్యశౌర్య త
ర్జనములచే ననూనగతి సర్వజగంబులు సంహరించు న
య్యనుపముఁడైన కాలునిభయంబును బొందఁడు సుమ్ము కావునన్. [4–713]

అన్నింటికన్నా భక్తి యోగం సులభం కనక దాని గురించే చెప్తున్నాడిప్పుడు. భక్తి యోగంతో నిన్ను నమ్ముకున్నవాడు యముడికి కూడా భయపడడు. ఈ పద్యంలో యముడు అనేది కాలుడు అని వాడాడు. అయితే ఆ కాలుడు ఎలా ఉంటాడో, కనిపిస్తాడో చెప్తున్నాడు; చటులాగ్రహ (చటుల – భయంకరమైన, ఆగ్రహంతో) భీషణ వీర్యశౌర్య తర్జనములచే (వీర శౌర్యాలతో, తర్జనము – చూపుడువేలు, చూపిస్తూ భయపెడుతూ) ననూనగతి (అనూన గతి – దేనికీ

తగ్గని దారిలో) సర్వజగంబులు సంహరించు (యముడికి వీరు నావారు, వారు కాదు అనేవి లేవు) నయ్యనుపముఁడైన (అనుపముడు – సాటిలేనివాడు).

చ. సరసిజనాభ! సత్పురుష సంగసమంచిత భక్తి యోగ వి
స్ఫురణ ననుగ్రహింపబడి శుద్ధము నొందినవాని చిత్తమ
స్థిర బహిరంగముం గనదు; చెందదు భూరితమస్స్వరూప సం
సరణ గుహం జిరంబు గనఁజాలు భవన్మహనీయ తత్త్వమున్. [4-718]

అయితే ఓ సారి భగవంతుడిమీదకి మళ్ళిన మనసు ఎలా ఉంటుంది? సత్పురుషుల సాన్నిహిత్యంతో బాగుపడిన మనసు ఇంక అస్థిరమైన ఇంద్రియాలపైకి, బయటకి చూడ్డానికి ఇష్టపడదు. ఎందుకంటే అలా లోపలకి చూసిన మనసు కి – గొప్పదైన (భూరి) తామస స్వరూపం అయిన సంసారం (పుట్టడం, మరణం అనేవి కలిగినది) చూడడానికి ఇష్టపడదు. మనసు అలా సంసారాన్ని చూడడానికి ఇష్టపడకపోవడం కూడా నీ కటాక్షం వలననే (భవన్మహనీయ తత్త్వమున్). ఈ విషయం ఇంతకు ముందు ఓ సారి చెప్పుకున్నదే. శ్రీరామకృష్ణులు అన్నవిషయం —సాధనలో ఒక స్థితి దాటాక భక్తుడికి భగవంతుడి గురించి తప్ప మరే విషయం రుచించదు.

.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS